# అందం



**అలహరి భవానీ విజయ్**

**మాది నాలుగంతస్థుల అపార్ట్‌మెంట్. పై అంతస్థులో ఉంది ప్రమీల. మెట్లెక్కాలంటే నా స్థూలకాయం మారం చేస్తుంది. తప్పదు మరి...**

**నా మనసు కుతకుత ఉడికిపోతూ ఉంది. నా మానసిక వేదనను ప్రమీలతో పంచుకోవాలి.**

ఆయాసపడుతూ మెట్లెక్కి కాలింగ్ బెల్ నొక్కాను. తల మాత్రం తలుపు సందులోంచి బయటపెట్టి "ఎవరొచ్చారన్నట్లు" చూసింది. ఆమె మొహంలో మనం చూడగలిగేది 'కళ్ళు' మాత్రమే.. ఎందుకంటే తన మొహాన్ని బురఖా లాగా ఒక చున్నీతో పూర్తిగా మూసివేసుకుంటుంది. ఒళ్ళంతా ఫుల్‌హాండ్స్ చుడీదార్. కాబట్టి మనం ఆమె కళ్ళని మాత్రమే చూడగల్గుతాం.

కానీ.. ఆ కళ్ళు ఎంత అందంగా ఉంటాయో.. ఆల్చిప్పల్లా ఉన్న ఆ కళ్ళని మూసి తెరుస్తూంటే.. హరిణేక్షిణి, కమలనయన, మేనలోచని... ఎట్సెట్రా పేర్లన్నీ గుర్తొచ్చేస్తాయి.

"ఏమిటీ.. ఈ వేళలో వచ్చావే ఆఫీస్‌కి వెళ్ళలేదా?" తలుపు తీసి రమ్మంటూనే అడిగింది ప్రమీల.

"ఇవాళ పెళ్ళి చూపుల పర్వం జరిగింది.. పిల్లవాడు నాకు నచ్చాడు. కానీ.. నా లావును చూసి వాళ్ళే కాస్త కట్నం ఎక్కువడిగారు. కుదిరేదే. కానీ అమ్మ మా వల్ల కాదంటూ ఖచ్చితంగా చెప్పడంతో ఏ సంగతీ చెప్తామని లేచి వెళ్ళిపోయారు. నా మనసు బాగోక నీ దగ్గరికి వచ్చాను." అంతా చెప్పేశాను దిగులు, నిరాశ కలగలిపిన గొంతుతో.

"అంటీ మంచి పనే చేసింది దీప్తీ! నీ లావుని వాళ్ళు డబ్బుతో తెక్కవేసి ఇప్పుడే అలా అడిగారంటే రేపు పెళ్ళయినాక మాటిమాటికీ నీలోని మైనస్ పాయింట్‌ని ఎక్స్‌ప్లాయిట్ చేసి వాళ్ళకి ప్లస్ పాయింట్‌గా మార్చుకుంటారు" నచ్చజెప్పే ధోరణిలో అనునయంగా చెప్పింది.

"కాదు.. ప్రమీ.. ఆ సంబంధం వాళ్ళు వెళ్ళగానే ఆ చందు వచ్చాడు. ఆ సంబంధం కుదర్లేదనగానే వాడి ముఖం దీపావళి మతాబులా వెలిగిపోయింది. వాడ్ని చూసి నాకు ఇంకా పుండుమీద కారం జల్లినట్లయింది." అన్నాను ఉక్రోషంగా.

"ఛ ఛ! చందు చాలా మంచి వ్యక్తి. అతనికి నీ మీద ఉన్న ప్రేమే ఆ సంబంధం కుదర్లేదనగానే, తన ముఖంలో సంతోషం వెల్లివిరుబూయించింది."

"వాడే ఈ సంబంధం చెడిపోవాలని కోరుకొని ఉంటాడు. మసిబొగ్గు మొఖానికి ప్రేమ కూడానా ప్రేమ.." ఈసడింపుగా అన్నాను.

"చందు వరసకి బావ అయినా, దూరపు చుట్టరికం.. "అనాకారి" కానీ, మంచి కంపెనీలో ఆడిటర్‌గా ఉన్నాడు. ఇంట్లో వాళ్ళందరికీ చందు అంటే అభిమానం. ఏ మత్తుమందు జల్లుతాడో మరి? అతనితో

మాట్లాడినవాళ్ళు కాస్త పరిచయం తోటి చాలా మంచివాడు అని అవార్డులు, మెచ్చుకోవడాలు. ఆ లిస్టులో ప్రమీల కూడా చేరిపోయింది.

"నన్ను చూస్తే చాలు ఆ చందుకి మొఖంలోకి వెల్తురు వచ్చేస్తుంది. నాకేమో వెయ్యి గొంగళి పురుగులు పాకినట్లుంటుంది వాడ్ని చూస్తే. ఇంట్లోవాళ్ళు నాకు చందునిచ్చి పెళ్ళిచేద్దామనుకున్నారు. నేను శివతాండవం చేసేసరికి.. బయటి సంబంధాలు చూడ సాగారు.

"చందుని తలుచుకుని పళ్ళు నూరు కున్నాను కసిగా"

"ఏమిటీ? ఆలోచిస్తున్నావు? అన్నీ సమయం వస్తే జరుగుతాయి. ప్రస్తుతం ఈ చేగోడీలు తినిపెట్టావా కాస్త?" ముందుకి ప్లేటుని జరిపింది. ఫైర్ యాక్సిడెంట్లో కాలి పోయి వంకర్లు తిరిగిన చేయి వికృతంగా ఉంది. అయినా నాకేమీ అనిపించదు. తన మంచి మనస్సు ముందు.

"ఫైర్ యాక్సిడెంట్ ఎలా జరిగిందని?" ఎప్పుడడిగినా చిరునవ్వుతో మాట దాటేస్తుంది. "సర్లే జ్ఞాపకం చేసుకోవడానికి భయంగా ఉందేమో" అని ఒకటి రెండుసార్లు అడిగి తరువాత అడగటం మానేశాను.

"రేపు కనకదుర్గ గుడికి వెళ్దామా దీప్తీ?" సడన్గా అడిగింది ప్రమీల.

"వెళ్దాం. నాక్కూడా కొంచెం ఛేంజ్ కావాలి ఈ రొటీన్ లైఫ్ లోంచి" అన్నాను విరక్తిగా.

నా విరక్తి ఎందుకంటే ముప్పై ఏళ్ళు వస్తున్నా సంబంధాలు కుదరటం లేదు. నా ఈడువాళ్లంతా పెళ్ళిళ్ళయి ఇద్దరు బిడ్డల తల్లులు కూడా అయిపోయారు. అసలు తన జీవితంలో కళ్యాణఘడియ ఉందో లేదో" అని.

* * *

గుడిలో భలే జనం. అసలే శ్రావణ శుక్రవారమేమో అమ్మవారి భక్తులు ఇసకవేస్తే రాలనంత జనసందోహంగా ఉన్నారు.

క్యూలో నించుని నించుని కాళ్ళు పీకే శాయి. దర్శనం కానిచ్చి నేనూ ప్రమీలా గుడిలో ఒకమూల కూర్చుని ప్రసాదాలు తింటున్నాం.

"గుడికి వస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది కదూ ప్రమీలా" అంటూ ప్రమీల వైపు చేసేసరికి పాపం చున్నీ వెనక్కి చేయి పోనిచ్చి, ముఖం తెలీకుండా చున్నీ చాటున కొబ్బరిముక్క కొరుకుతుంది తను. క్షణం సేపు జాలేసింది తనని చూసి.

అంతలో ఒక పదేళ్ళ అమ్మాయి పరిగెత్తుకుంటూ వచ్చి, కాలు జారి పడి పోయింది. ఒకటే ఏడుపు. అంతలోకి ఆ పాపకి అమ్మా, నాన్నా ఆదుర్దాగా వచ్చి దెబ్బలేం తగల్లేదుకదా అని పరిశీలించి, పాపని ఓదార్చి ముద్దులు పెట్టేసుకుంటున్నారు.

ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. వాళ్ళ అమ్మ కారునలుపు. వాళ్ళ నాన్న తెలుపేగానీ ముక్కు, మొహం ఏం బాగోలేదు. బట్టతల, బానకడుపు. చూడ్డానికేం బాగోలేదు. కానీ ఆ పాపను తేరిపార చూశాను. చక్కని కనుముక్కు తీరు, పసిమని ఛాయ. ఇప్పుడే ఇంత అందంగా ఉంది. పెద్దయితే ఇంకా ఎంత అందంగా ఉంటుందో. అ కళ్ళని చూస్తూ తుళ్ళిపడ్డాను. ఆ కళ్ళు ఎక్కడో చూసినట్లుగా మనసుకి తట్టింది. సందేహంగా ప్రమీల కళ్ళని చూశాను.

ప్రమీల కళ్ళలో నీటిపొర. ఎక్కడో లింకు అందుతోంది. అర్థంకాని పజిల్కు ఎక్కడో చిన్న క్లూ దొరికినట్లుగా అనిపించింది నాకు.

"ఏవండీ పాప ఆకలికి ఉండలేదు. పులిహోర తీసుకురండి. తినిపిస్తాను" భర్తకి చెప్తోంది పాప తల్లి.

పాపని ఒళ్ళో కూర్చుబెట్టుకుని, ఆ మాటా, ఈ మాటా చెబ్తూ కిందపడిన దెబ్బల్నీ, బాధనీ మర్చిపోయేట్లు చేస్తోంది ఆమె.


ఇంతలో ఆమె భర్త పులిహోర పొట్లంతో రాగానే ముగ్గురూ కూర్చుని పాపకి తినిపించి, వాళ్ళు తినీ లేచి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళేదాకా ప్రమీల వాళ్ళనే చూస్తూ ఉంది. వాళ్ళు వెళ్ళగానే తనలోతాను గొణు క్కుంటూనే ఉంది. ఈ లోకంలో లేదు.

నేను జాగ్రత్తగా ఆటోలో ప్రమీలని ఇంటికి చేర్చాను. తనని బెడ్లో పడుకోబెట్టి, ఫాన్ వేసి, మంచినీళ్ళిచ్చి ఇలా సపర్యలు చేశాక తను కొంచెం తేరుకుంది. భోరున ఏడ్చేసింది. ఆ ఏడుపు ఉధృతం ఒక అరగంట తరువాత తగ్గింది.

నిదానంగా నేను అడగకుండానే తన గురించి చెప్పడం మొదలుపెట్టింది.

"దీప్తీ నేను అమ్మా నాన్నలకి, ఇద్దరు అన్నయ్యలకి గారాలపట్టిని. నేను అందగత్తెననే విషయం నా చుట్టూ ఉన్న అందరూ మాటల్లో, చూపుల్లో పదేపదే మెచ్చుకొని, నాలో గర్వాన్ని, అహంకారాన్నీ పెంచారు. నేను రోజులో పాతికభాగం అద్దం ముందే గడిపేదాన్ని. నా అందానికి గర్వపడ్తూ, అనాకారుల్ని ఈస డించుకునేదాన్ని.



## ఐశ్వర్య ఎంగేజ్మెంట్!

వేలంటైన్స్డే రోజున ఐశ్వర్యారాయ్, వివేక్ ఒబెరాయ్లకు ఎంగేజ్మెంట్ జరిగినట్లు బాలీవుడ్లో పుకార్లు వినిపిస్తున్నాయి. ఐశ్వర్య బర్త్డేనాడు 30 బహుమతులతో ముంచెత్తిన వివేక్, 'పెళ్ళెప్పుడవుతుంది బాబూ..' అని ఐశ్వర్య వెంట తిరుగుతూ తొందరపడుతున్నా, 'ఇంకొంత కాలమంటూ...' ఐశ్వర్యారాయ్ సర్దిచెబుతూ వస్తున్నట్లు వదంతులు వినిపించాయి. అయితే పెళ్ళి సంగతి సరేకాని ప్రేమికుల రోజే తమ ఎంగేజ్మెంట్ మాత్రం జరుపుకుందామన్న వివేక్కి ఐశ్వర్య గ్రీన్సిగ్నల్ ఇచ్చిందట!

కాలేజీలో చేరగానే అందరు అబ్బాయిల్ని నేను ఆకర్షించాను. కానీ నా మనసుకి శ్రీహర్ష ఆకర్షించాడు. 'అందగాడు, చలాకీగా, నవ్విస్తూ ఉండేవాడు. నాకు శ్రీహర్షకీ మధ్య పరిచయం ముదిరి ప్రేమగా మారి పెళ్ళిచేసుకోవాలనుకునే దాకా వచ్చింది. కానీ, మా మామయ్య కొడుకుతో మా వాళ్ళు బలవంతంగా పెళ్ళి నిశ్చయించారు. ఏడ్చి మొత్తుకున్నా వినలేదు. అన్ని విషయాల్లో నీవాడింది ఆటగా, పాడింది పాటగా పెంచాం.. ఈ విషయంలోమా మాట వినాల్సిందే అంటూ మూడు ముళ్ళు వేయించేశారు.

జగన్ చూడడానికి బాగోడు. గుడిలో చూశావుగా అతడిని. కానీ చాలా మంచివాడు. నేను పెంకిగా ప్రవర్తించినా పసిపాప అల్లరిచేస్తే కన్నతల్లి చిరునవ్వు నవ్వినట్లుగా నవ్వి నాకు అనుకూలంగా నడుచుకునేవాడు. కానీ అతగాడ్ని చూస్తే నాకు నచ్చేది కాదు.

ఇష్టం లేని కాపురం అలా ఒకటిన్నర సంవత్సరం గడిచింది. ఒకటిన్నర సంవత్సరంలో యామిని పుట్టింది. దానికి ఆర్నెల్లప్పుడు..

ఓ రోజు మా ఇంటిని వెతుక్కుని శ్రీహర్ష వచ్చాడు. జగన్నాథం ఇంట్లో లేదు.

"ఆయన లేరు"

"తెలిసే వచ్చాను".

"ఎందుకు?"

"నిన్ను వదిలి నేనుండలేను. నువ్వు లేక పోతే నేను నా జీవితాన్నే అంతం చేసుకుంటాను. రా.. మనిద్దరం ఎటైనా వెళ్ళిపోదాం."

"నాకు పెళ్ళయింది. పైగా ఒక బిడ్డ తల్లినికూడా"

"ఫర్వాలేదు ఆ తాళిని తెంచేస్తే పెళ్ళి పెటాకులు కానట్లే. నీ బిడ్డని, నా బిడ్డగా చూసుకుంటాను. ప్లీజ్ కాదనకు." చివాల్న నా రెండు చేతులూ పట్టుకున్నాడు. అప్పుడు గుమ్మంలో అలికిడయ్యింది. జగన్నాథం. జగన్నాథాన్ని చూసి తల దించుకుని వెళ్ళి పోయాడు శ్రీహర్ష.

నన్ను తిడతాడని, మందలిస్తాడని అనుకున్నాను. కానీ జగన్ నన్ను ఏమీ అనలేదు. సంజాయిషీగా ఏదో చెప్పబోతే.. "ప్రమీలా నీమీద నాకు పూర్తి నమ్మకం ఉంది." అంటూ తుంచేశాడు.

మదికొలనులో రాయి విసిరినట్లు అల్లకల్లోలంగా ఉంది. అప్పట్నుంచీ శ్రీహర్ష రావడం, పోవడం ఎక్కువయింది.

నా మనసులో మళ్ళీ శ్రీహర్షకి స్థానం బలపడ్తూ వస్తోంది. ఆ సమయంలో ఒక వారం రోజులు కనపడలేదు శ్రీహర్ష. అతడికోసం, అతడిని చూడడం కోసం అల్లాడిపోయాను. వారం తర్వాత మాసినగడ్డంతో బికారిలాగా వచ్చాడు. "ఈ రోజు రాత్రికి ఈ ఊరి చివర లాడ్జికి వచ్చేయి. ఇద్దరం ఊరొదిలి ఎక్కడికైనా వెళ్ళిపోదాం. నువ్వు రాలేనంటే నేన్నీకు ఇక ఎప్పటికీ కనపడను అంతే" అన్నాడు.

ఆ రోజంతా మనసు ఊగిసలాడింది. త్రాసులోని ముల్లు హర్షవైపే మొగ్గింది. అంతే బట్టలన్నీ సూట్కేసులో సర్దుకుని గడప దాటాను. నన్ను చూసిన హర్ష ఆటబొమ్మ దొరికిన చిన్నపిల్లాడే అయ్యాడు. ఆనందంగా మూడేళ్ళు ఎలా దొర్లిపోయాయో తెలీలేదు. నేను జగన్ యామినీలని పూర్తిగా మర్చిపోయాం.

అలాంటి సమయంలో ఒకరోజు నా పాపం బద్దలయినట్లుగా స్టవ్ పేలింది. డెబ్బై శాతం ఒళ్ళు కాలింది. హాస్పిటల్లో అడ్మిట్ అయిన దగ్గర్నుంచీ రెండుసార్లు వచ్చాడు హర్ష. డిశ్చార్జ్ అయ్యే రోజున బిల్ కట్టడానికి వచ్చాడు. "ఈ మధ్యన కనిపించలేదే"... ఆవేదనగా అడిగాను... జవాబు లేదు హర్షనించి.

"ఈ ముణ్ణెల్లలో రెండుసార్లే వచ్చావు" మళ్ళీ అడిగాను రెట్టిస్తూ..

"చిన్న పని మీద మా ఊరికి వెళ్ళాను" ఎటోచూస్తూ జవాబిచ్చాడు.

"ఔనుమరి. నా ఒళ్ళు కాలిపోయి వికృతంగా తయారయింది. నా మొహంలో కళ్ళు తప్పించి నోరు, ముక్కు ఉండాల్సిన చోట కాలిపోయి నరాలు బయటపడ్డాయి. నా మొహం చూస్తూ ఎలా సమాధానం చెప్తాడు" మనసులో అనుకున్నాను.

ఇంటికొచ్చిన తరువాత అద్దంలో నా మొహం చూసి నేనే జడుసుకునేదాన్ని. ఈ మధ్యన హర్ష నెలకి ఒకసారి వచ్చి నా అవసరాలకు డబ్బిచ్చి వెళ్ళిపోతున్నాడు. "ఏమిటీ రావట్లేదంటే?" మా ఊళ్ళో పనుండి వెళ్ళున్నాను అంటున్నాడు. ఇలాగే ఆర్నెల్లు దొర్లి పోయాయి. నా వికృతరూపానికి అలవాటుపడ్డాను.

ఒకరోజున నాన్న నన్ను వెతుక్కుంటూ వచ్చారు. నాకు దుఃఖంతో గొంతు పెగల్లేదు. నాన్న తనకి ఇష్టం లేకుండా వచ్చిన సంగతి వ్యక్తపరిచారు.

"ఇప్పుడు కూడా జగన్ నువ్వు కావాలని, నీ కోసం ఎదురు చూస్తున్నాడు. మనసు మార్చుకుని వస్తే కాపురానికి తను రెడీ అంటున్నాడు. యామినీకోసం అయినా రమ్మని, తాను చెప్పినట్లుగా చెప్పమన్నాడు. ఏమంటావు? చెప్పు" అని గోడకి చెప్పినట్లు చెప్పాడు.

"బాగున్నప్పుడు అతన్ని వదిలేసి, ఈ అనాకార రూపంతో మళ్ళీ అతని జీవితంలోకి.. ఛీ ఛీ వద్దు" జగన్ని మళ్ళీ పెళ్ళి చేసుకుని యామినికి మంచి తల్లిని తీసుకురమ్మనండి. నా జీవితం మోడుబారింది. నన్నిలాగే వదిలేయండి." భోరున ఏడుస్తూ, నాన్న పాదాల చెంత నేను కుప్ప కూలిపోయాను. "అనుభవించు! అంతా నీ ఖర్మ" అంటూ ఆయన వెళ్ళిపోయారు. సాయంత్రం శ్రీహర్ష వచ్చాడు.

శ్రీహర్ష దగ్గర ఈ విషయం ప్రస్తావిస్తే "వెళ్ళకపోయావా" అన్నాడు కూల్గా ఎటో చూస్తూ.

దిమ్మెరపోయాను. "ఏమంటున్నావ్?

## జీవన నృత్యము

తామరాకు మీద తూగాడు తుహిన
కణము
భాస్కరుని బంగారు కిరణము సోకి
క్షణం రెప్పపాటుకి దొరికిన
సౌందర్యము
నీలిగగనము క్రింద జీవనముతో
తొణికిసలాడుతున్నది
మంద్ర మధురధ్వనుల ప్రతిధ్వని
జగతినుండి
పదములేని పవన సంగీతము వలె
జనించి
మరెంతో నీ అనురాగపు జల్లు
అనంతంగా కురిసి
ఆర్ద్రతతో ఆశీర్వదిస్తాయి జనావళిని.
నా హృదయం నీ పదముల లయకు
తాళం వేస్తుంది
నా మనసు నీ స్నేహార్థియై తీయని
కలలు కంటుంది
నాతో నర్తించు, ఓ తాండవమూర్తి
సంపూర్ణలాస్యముతో జీవన నృత్యముల
ఎల్లవేళలా!

(అంతర్జాతీయ బెస్ట్ పొయెమ్స్ అండ్ పొయెట్స్ 2001, ఇంటర్నేషనల్ లైబ్రరీ పొయిట్రీ ఎన్నిక చేసి ప్రచురించిన ఆంగ్ల కవిత)

మూలం : డా. ఉమ ఎయ్యున్ని
ఫ్లోరిడా, యు.ఎస్.ఎ.
అనువాదం : వి. వాణీమోహన్

నువ్వు?"

"పోనీ, నువ్వే కావాలంటున్నాడు వెళ్ళక పోయావా?" నంగినంగిగా.

"అంటే నీ ఉద్దేశం?"

"ఏముంది నిన్ను చూస్తేనే డొకొస్తుంది. నాకు నీతో కాపురమా?.. నెవర్.. నా వల్ల కాదు.. నన్ను నమ్మి వచ్చావు.. ఉల్లాసంగా మూడేళ్ళు నాతో కలిసి ఉన్నందుకు.. పోన్లే పాపమని, జాలితో నెలనెలా నీ ఖర్చులు నేనే భరిద్దామనుకుంటున్నాను".. వదిలించుకునే ధోరణిలో.

అంతే నా మనసు భగభగ మండి పోయింది.

"రేయ్" అంటూ కాలర్ పట్టుకుని చొక్కా చించేశాను. ఆ చెంపా, ఈ చెంపా వాయిం చేశాను. ఈ పెనుగులాటలో శ్రీహర్ష పర్స్ దూరంగా విసిరినట్లుగా పడింది. ఆ పడటంలో పర్సు తెరుచుకుంది. అందులో పెళ్ళి ఫొటో శ్రీహర్షది, శ్రీహర్ష పక్కన మెడలో దండల్తో చక్కని అమ్మాయి అమాయకంగా.

దాన్ని చూస్తూనే మతి భ్రమించిన దానిలా నిలబడిపోయాను. తల సర్దుకుని, చొక్కా సరిచేసుకుంటూ నా దగ్గరగా వచ్చి, నా చేతిలో పర్సు లాక్కుంటూ..

"ఈ ఫోటో చూడగానే దెయ్యం దిగిపోయిందనుకుంటా? నా పక్కనుంది నా భార్య. సద్గుణవతి. నీలాంటిరకం కాదు. మాకు పెళ్ళయి మూడు నెలలయింది..ఎలాగూ తెలిసి పోయింది కాబట్టి ఇప్పుడు చెప్తున్నా"..

మెల్లిగా శ్రీహర్ష దగ్గరికి వెళ్ళి సూటిగా చూస్తూ..

"చూడు ఈ అమ్మాయికయినా విశ్వాసంగా, మంచి భర్తగా ఉండు. నమ్మక ద్రోహం చేయడానికి చూడకు. ఫో.. ఇంకెప్పుడూ నా కంటికి కనిపించకు.." ఖచ్చితంగా చెప్పాను. విసవిసా వెళ్ళిపోయాడు. నా జీవితంలోంచి కూడా. నా బ్రతుకు నాకే అగమ్య గోచరంగా ఉంది.

నేను "అనాథగా" మిగిలిపోయాను. నా జీవితం తెగిన గాలిపటం అయింది. "బాహ్య సౌందర్యం" చూసి ప్రేమించామని అనుకునే వాళ్ళకి నా జీవితం ఒక గుణపాఠం" "అందుకే చెప్పాను దీప్తీ! చందు చాలా మంచివాడు అని.

"నాకు ఇప్పుడు యామినీని, జగన్నాథాన్ని చూస్తే, నా స్థానంలో ఉన్న శాంతని చూస్తే నేనేం పోగొట్టుకున్నానో, నేను చేజార్చుకున్న దేమిటో ఇప్పుడిప్పుడే నాకర్థం అవుతోంది."

"ఇప్పుడు చెప్పు అందమున్నంత వరకూ ప్రేమించి అందవికారం కాగానే వదిలేసిన శ్రీహర్ష అందగాడా? లేక అందవిహీననైన నన్ను లేచిపోయానన్న పేరు తెచ్చిన నన్ను.. అయినా పర్వాలేదు. ఇంకా కూడా.. నాకు ప్రమీలే కావాలని నాన్నగార్ని రాయబారం పంపిన జగన్నాథం అందగాడా? శ్రీహర్షతో పోలిస్తే జగన్ మనసున్న అందగాడు. నిజమైన అందగాడు.. మంచివాడు" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది ప్రమీల.

నాకేదో జ్ఞానోదయం అయినట్లు అనిపించింది. ప్రమీలని ఓదార్చి, కాఫీ ఇచ్చి, ప్రమీల తేరుకున్నట్లనిపించాక భుజంమీద తట్టి, "ప్రమీ వెళ్ళొస్తానని' చెప్తూ బయల్దేరాను.

సాయంత్రం ఇంటికెళ్ళగానే అమ్మతో "అమ్మా చందుతో నా పెళ్ళి ఖాయం చేసేయండి" అన్నాను.

అమ్మ ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టింది. అప్పుడే అక్కడే ఉన్న చందుని చూశాను. ఇప్పుడు చందు నా కంటికి మనసున్న అందగాడుగా కనిపించాడు. ఆ సమయంలో చందు కళ్ళల్లో సంతోషంతో మెరిసిన మెరుపులు నా దృష్టిని తప్పించుకోలేదు. నా మనసుకి ముసిరిన మబ్బులు వీడి, ఇప్పుడు నా మనసున ఉన్న చంద్రుడు చందు అనుకుని తృప్తిగా నిట్టూర్చాను.

✱

# మీ సమస్యలకు పరిష్కారాలు

ప్రియదత్త పాఠకులకు ప్రత్యేకం

మనలో చాలామంది వివిధరకాల సమస్యలతో సతమతమవుతూ ఉంటారు. అలాంటి వారందరికీ ఉచిత రీతిని సహకరించాలన్న భావంతో, తమపేరు చెప్పడానికి అంగీకరించని ఒక ఆధ్యాత్మిక గురుదేవులు, పాఠకుల సమస్యలకు సమాధానాలివ్వడానికి అంగీకరించారని తెలపడానికి ఆనందిస్తున్నాము.

పాఠకులు ఈ క్రింది ప్రశ్న కూపన్ పూర్తిచేసి వారంలోగా మాకు పంపితే, వారి నుండి మీకు సమస్యలకు పరిష్కారమార్గాలు అందజేయడం జరుగుతుంది.

ఈ విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు అంగీకరించబడవని గమనించాలి. ప్రశ్నలు మాకు చేరిన వెంటనే వరసక్రమంలో సమాధానాలు అందించడం జరుగుతుంది.

\- ఎడిటర్

## గురుదేవో మహేశ్వరః
## సమస్య - సమాధానం

పేరు:...........................................................................

పుట్టిన తేదీ :.................. సమయం:.................. నక్షత్రం:..................

మీ ప్రశ్న :...........................................................................

...........................................................................

(స్థలం చాలనిచో వేరే తెల్లకాగితంపై రాసి ఈ కూపనుతోబాటు జతపర్చండి)

చిరునామా :...........................................................................

...........................................................................

...........................................................................

...........................................................................పిన్ కోడ్ :..................

**గమనిక :**

* కూపన్ జతపర్చని ప్రశ్నలు అంగీకరించబడవు.
* ఒకరు ఒక సమస్య గురించి మాత్రమే ప్రశ్న రాసి పంపాలి.
* సమాధానాలు మాకు చేరిన ప్రశ్నల వరుసక్రమంలో, ప్రియదత్తలో ప్రచురించడం జరుగుతుంది. మీ పేరు, చిరునామా రహస్యంగా ఉంచాలని భావిస్తే ముందుగా ఆ విషయం తెలపాలి.

\- ఎడిటర్